సాక్షి ములుగు

బుధవారం ❙ 11 ❙ అక్టోబర్ ❙ 2023



నగదు పట్టివేత

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు.

- IIలో▸



రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

- IIలో▸

ఈ ఎన్నికల్లో మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖుర్రాపాష అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం $35^0/24^0$

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

మానసిక ఒత్తిడితోనే ఆరోగ్య సమస్యలు

● సీనియర్ సివిల్ జడ్జి మాధవి



వెంకటాపురం(ఎం): మానసిక ఒత్తిడితోనే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ప్రతి ఒకరూ ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని జిల్లా న్యాయ సేవా సంస్థ సీనియర్ సివిల్ జడ్జి టి.మాధవి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక ఒత్తిడిని బట్టి శారీరక ఆరోగ్య స్థితి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్, న్యాయవాదులు మహేందర్, స్వామిదాస్, చంద్రయ్య, రవిందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక


మంగపేట: మండల కేంద్రంలోని ఎక్కటి సరోజినీ, శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023 విద్యా సంవత్సరంలో ఇంటర్ సెకండియర్ వార్షిక పరీక్షలు రాసి ఉన్నత మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థినులు జాతీయ ఉపకార వేతనాలు అందుకునేందుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. ఎంపికైన వారిలో బండారి మరియ 982/1000, గుర్రాల ప్రేమలత 959/1000, దంతెనపల్లి మానస 956/1000, కుంచం రూపకళ 954/1000, గుమ్మడాల నీలిమ 945/1000, గద్దేటి అఖిల 938/1000 మార్కులు సాధించి కేంద్ర విద్యాశాఖ ప్రతిఏటా అందించే జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు అందుకునేందుకు ఎంపికయ్యారు. వీరికి డిగ్రీ స్థాయిలో మూడేళ్లు, పీజీ స్థాయిలో రెండేళ్ల పాటు ప్రతీ సంవత్సరం రూ.10వేలు చెల్లించడం జరుగుతుందన్నారు. జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూములను ఆదివాసీలకే పంచాలి



వాజేడు: ప్రభుత్వ భూములను ఆదివాసీలకే పంచాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మండల పరిధిలోని మండపాక వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసిన స్థలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. సీపీఎంకు చెందిన కొందరు వారి స్వలాభం, ఓటు బ్యాంకు కోసం మోస పూరిత మాటలు చెప్పి ప్రభుత్వ భూమిని కబ్జా చేసే పనిలో పడ్డారని విమర్శించారు. వారి మాటలను నమ్మవద్దని హితవు పలికారు. 2017లో అప్పటి ములుగు సబ్ కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములు గిరిజనేతరుల కబంధ హస్తాల్లో చిక్కకుండా దిమ్మలను కట్టి రక్షణ కల్పించినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో సీపీఎంతో పాటు ఏ పార్టీని గ్రామాల్లోకి రాకుండా నిలువరించాలన్నారు. ఏజెన్సీ చట్టాలను అధికారులు పక్కాగా అమలు చేయాలని కోరారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



ములుగు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీర ప్రహ్లాద్ ఆధ్వర్యంలో టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు గంట భగవాన్‌రెడ్డి, రేపాక దేవదాసులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు నియోజకవర్గం అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ఐటీడీఏలకు 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరికొండ బలరాం, నగరపు రమేష్, తాటి కృష్ణ, భూక్య రాజునాయక్, అల్లె శోభన్, మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, కొత్త సురేందర్, రాజు, కార్తీక్, రాజేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కసరత్తు షురూ..

అమల్లోకి ఎన్నికల కోడ్

- హోర్డింగులు,ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు
- మీడియా సెంటర్, చెక్ పోస్టుల ఏర్పాటు



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో వచ్చే నెల 30న జరగనున్న ఎన్నికలకు అధికారుల కసరత్తు మొదలైంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల వారీగా అధికారులు, సిబ్బంది, ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఎన్నికలకు ముందు మూడు నెలలుగా జాతీయ రహదారులు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలోని భారీ హోర్డింగులు, ఫ్లెక్సీలు నాయకులు ఏర్పాటు చేయగా వాటిని తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో పాటు కార్యదర్శులు, కారోబార్‌లు వాల్ రైటింగ్‌ను చెరిపి వేయిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం విలేకరుల సమావేశంలో అధికారులు పలు వివరాలను వెల్లడించారు. అనంతరం అధికారులతో ఎన్నికల నియమావళిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 303 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

మీడియా సెంటర్ ఏర్పాటు

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతిరోజూ మీడియా పాయింట్‌కు చేరుకుని సమాచారాన్ని ప్రజలకు అందిస్తారు. సెంటర్‌కు మీడియా సర్టిఫికేషన్ సెల్(ఎంసీఎంసీ)కి చైర్మన్‌గా కలెక్టర్ ఇలా త్రిపాఠి, కన్వీనర్‌గా డీపీఆర్వో రఫిక్ వ్యవహరిస్తారు. ప్రతిరోజూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమయ్యే వార్తలను పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

సర్వేలెన్స్ బృందాల ఏర్పాటు

ప్రార్థనా మందిరాలు, చర్చిలు, మసీదులు, ఆలయాల చుట్టు పక్కల 100 మీటర్ల మేర ఎవరైనా సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తే వాటిని గుర్తుపట్టి తగిన చర్యలు తీసుకోవడానికి జిల్లాలో ప్రత్యేక సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుగుతూనే ఉంటాయి. వీటితో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, ఎంసీఎంసీ, ఎంఎంసీ ఇతర కమిటీలు ఉంటాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడం నేరంగా పరిగణించబడుతుంది.

చెక్ పోస్టుల ఏర్పాటు

ములుగు– ఇల్లందు నియోజకవర్గాల మధ్య, మల్లంపల్లిలో, గట్టమ్మ ఆలయం వద్ద, వెంకటాపురం(ఎం) వెల్తుర్లపల్లిలో, పస్రాలో, బ్రాహ్మణపల్లి, వాజేడు, జగన్నాథపురం వద్ద చెక్ పోస్టులను పోలీసులు ఏర్పాటు చేశారు. అధికారులు వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అధికారులు నిరంతరం అప్రమతంగా ఉండాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

బ్యాలెట్ బాక్సుల భద్రత పెంపు

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరం పక్కన నూతనంగా స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సుల భద్రత కట్టుదిట్టం చేశారు. షెడ్యూల్ వెలువడిన తరువాత భద్రత మరింతగా పెంచారు.

1950 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఫిర్యాదులను అధికారులకు అందించడానికి డయల్ 1950 నంబర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. డీపీఓ వెంకయ్య, డీఎస్‌డీఓ అరవింద్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డీటీలతో గతంలో ఎలక్షన్ కమిషన్ అందుబాటులోకి తీసుకొచ్చిన సీ విజిల్ యాప్ సైతం అందుబాటులో ఉంటుంది. సీ విజిల్ యాప్‌పై ప్రజలకు అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ అంకిత్, ఇతర ఉన్నతాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సీ విజిల్ ద్వారా 100 నిమిషాల సమయం మాత్రమే ఉంటుంది, అధికారులు ఆ సమయం లోపు అక్కడికి చేరుకొని చర్యలు తీసుకోవాలి.



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్



మల్లంపల్లిలో కారును చెక్ చేస్తున్న పోలీసులు



ఫ్లెక్సీలు తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

చిన్నారులపై దృష్టి పెట్టాలి

హెల్త్ అండ్ ఫ్యామిలీ స్పెషల్ ఆఫీసర్లు అరుణ్‌కుమార్, ప్రశాంత్



బాలింతకు సూచనలు చేస్తున్న డబ్ల్యూహెచ్‌ఓ టీం



ఎస్ఎస్ తాడ్వాయి పీహెచ్‌సీలో..

ఏటూరునాగారం: బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారులపై దృష్టి పెట్టాలని డబ్ల్యూహెచ్‌ఓ, తెలంగాణ కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ ఆఫీసర్లు డాక్టర్ అరుణ్‌కుమార్, డబ్ల్యూహెచ్‌ఓ సర్వీలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్‌లు అన్నారు. మండల కేంద్రంలోని రామాలయం వద్ద సబ్‌సెంటర్, ఆ పరిధిలోని ఇంటింటా సర్వేలను వారు మంగళవారం చేపట్టారు. గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి చిన్నారులకు వేస్తున్న టీకాలు, ఆరోగ్య సూత్రాలపై ఆరా తీశారు. చిన్నారులు బరువు, ఎత్తు తక్కువ ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. రెండు రోజుల పాటు జిల్లాలో డబ్ల్యూహెచ్‌ఓ టీం పర్యటిస్తుందన్నారు. రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేశ్వర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లబ్ధిదారులు, టీకాలు, ఇంద్రధనుస్సు కార్యక్రమ వివరాలను డాక్టర్ అరుణ్‌కుమార్‌కు వివరించారు. ఉపకేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సు ముందస్తు ప్రణాళికలు, టీకాలకు సంబంధించి, టీకాలు తీసుకోకుండా ఉన్నవారి వివరాలలు, టీకాలు పొందే వారి వివరాలను ఏఎన్ఎం గీతను అడిగి తెలుసుకున్నారు. తప్పిపోయి టీకాలు వేసుకోని వారిని గుర్తించడంలో నిర్లక్ష్యం చేయకూడదని, ప్రణాళికలతో ముందుకు పోవాలని సూచించారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న టీకాలు అన్ని సమయానుకూలంగా అందించి చిన్నారులను రక్షించాలన్నారు. అనంతరం రొయ్యూరు ఉపకేంద్రంలో నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనుస్సు టీకా కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ఏఎన్ఎం రూస్సీలక్ష్మి దగ్గర ఉన్న రికార్డులు, రిపోర్టులు తనిఖీ చేశారు. టీకాలు చిన్నారులకు ఇవ్వడమే కాకుండా వెంటనే వాటిని రిజిస్టర్‌లో పొందుపరచాలని అలాగే యువిన్ యాప్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ బిడ్డకు టీకా వేసే సమయంలో తప్పనిసరిగా ఏఎన్ఎంకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అదే విధంగా మహిళల్లో వచ్చే సర్వికల్ కేన్సర్ నివారణకు వచ్చే ఏడాది జనవరిలో వ్యాక్సినేషన్ వస్తుందని డబ్ల్యూహెచ్‌ఓ మానిటరింగ్ అధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. తొమ్మిదేళ్ల లోపు, 45 వయస్సు దాటిన వారికి వేసే విధంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రొయ్యూర్ వైద్యాధికారి సుమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం మాస్ మీడియా ఆఫీసర్ తిరుపతయ్య, మానిటరింగ్ సూపర్‌వైజర్ సంపత్, డీడీఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ టీకాలు వేయించుకోవాలి

ఎస్ఎస్ తాడ్వాయి: ప్రతి ఒక్కరూ టీకాలు వేయించుకోవాలని నేషనల్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డబ్ల్యూహెచ్‌ఓ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ ఆఫీసర్లు అరుణ్, ప్రశాంత్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు డేవిడ్‌లు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్ మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు 5.0లో ఐదేళ్ల లోపు చిన్నారులకు టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ టీకాల ద్వారా పిల్లలను వ్యాధుల నుంచి రక్షించేందుకు భారత ప్రభుత్వం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. మిషన్ ఇంద్రధనస్సులో చివరి రౌండ్ 14వ తేదీ వరకు టీకాలు వేయించుకోని వేయించుకోవాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలో కోల్డ్‌చైన్ అమలు తీరు గురించి ఫార్మసిస్టును అడిగి తెలుసుకున్నారు. టీకాలను సంబంధించిన రిజిస్టర్‌లను బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రణధీర్, డీపీఎంఓ సంజీవరావు, ఎస్‌యూఓ వెంకటేశ్వర్లు, హెచ్‌వీ సరస్వతి, లక్ష్మి, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ తిరుపతయ్య, జిల్లా మానిటరింగ్ సూపర్‌వైజర్ సంపత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాగజ్యోతి

ఎస్ఎస్ తాడ్వాయి: కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని గూడెప్పాడ్‌లోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బడే నాగజ్యోతి సమక్షంలో ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన సింగల్ విండో డైరెక్టర్ పాలకుర్తి రజిత, రవీందర్, వార్డు మెంబర్ ముత్యాల సతీశ్ మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారిని కండువా కప్పి నాగజ్యోతి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు జిల్లా అభివృద్ధిలో భాగంగా ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేశారన్నారు. అంతేకాకుండా ఏటూరునాగారంలో ఫైర్ స్టేషన్ కూడా ఏర్పాటు అయ్యిందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని వివరించారు. బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు దాదాపు ఖాయమైందని నాగజ్యోతి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే సీతక్క



గ్యారంటీలను వివరిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ములుగు మండల పరిధిలోని జాకారంలో మంగళవారం చేపట్టిన గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గెలిచిన వెంటనే వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా పథకంలో ప్రతిఏటా రైతులకు ఎకరాకు రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు, ప్రతీ సంవత్సరానికి వరి పంటకు రూ.500 బోనస్, గృహజ్యోతి పథకంలో కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, ఇంటి స్థలం లేని వారికి 250 గజాల స్థలం, యువ వికాసం పథకం కింద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా, మండలాల్లో ఇంటర్నేషనల్ స్కూల్స్, వృద్ధులకు రూ. 4 వేల పింఛన్, రాజీవ్ ఆరోగ్య శ్రీలో రూ. 10 లక్షలు వైద్య ఖర్చుల కింద అందిస్తామని వివరించారు. అనంతరం జాకారం గ్రామానికి చెందిన 70 మంది మహిళలు, 30 మంది యువకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, వెంకన్న, చాంద్‌పాషా, పల్లె జయపాల్ రెడ్డి, నల్లెల్ల భరత్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సిబ్బందితో మాట్లాడుతున్న అప్పయ్య

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యశాలను సందర్శించి రికార్డులను పరిశీలించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డెంగి, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం ఎదిర వైద్యశాలలో కాంట్రాక్ట్ వేజ్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పూనెం రమణమ్మ కుటుంబాన్ని ఆయన పరామర్శించి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతి కుమార్, ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ, వైద్య సిబ్బంది యాకలక్ష్మి ఉన్నారు.

ఆన్సర్ బుక్‌లెట్‌లనే మార్చేశాడు!

బీఎల్ఐఎస్సీలో పాసయ్యేందుకు ఓ ఉద్యోగి నిర్వాకం

- సహకరించిన కేయూ పరీక్షల విభాగంలోని ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులు
- ఇద్దరినుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం.. విధుల నుంచి తొలగింపు
- గోప్యంగా విచారణ కమిటీ.. నివేదిక అందజేత





సాక్షి EXCLUSIVE

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో పాసయ్యేందుకు కొందరు పరీక్షలు రాసేటప్పుడే కాపీయింగ్‌కు పాల్పడుతుంటారు. అందులో కొందరు స్క్వాడ్లకు పట్టుబడి డీబార్ కూడా అవుతుంటారు. పరీక్షల ఫలితాలు వచ్చాక రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసి పాసయ్యేందుకు పైరవీలు చేస్తుంటారు. ఇది అందరికి తెలిసిందే. కానీ ఇక్కడ మరో రకం దందా జరిగింది. యూనివర్సిటీలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగి అడ్డదారిలో పాసయ్యేందుకు ఏకంగా ఆన్సర్ షీట్లను పరీక్షల విభాగంలో పనిచేసే ఇద్దరు తాత్కాలిక ఉద్యోగుల (దినసరి వేతన) సహకారంతో మార్చాడు. ఈ విషయం కొన్నినెలల క్రితమే పరీక్షల విభాగం అధికారుల దృష్టికి రాగా గోప్యంగా ఉంచారు. ఇద్దరి తాత్కాలిక ఉద్యోగులను విధులనుంచి తొలగించారు. కానీ ఆ రెగ్యులర్ ఉద్యోగిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీనికి సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యా కేంద్రంలో బీఎల్ఐఎస్సీ ఏడాది కోర్సు ఉంది. 2021–2022 విద్యా సంవత్సరంలో ఈ కోర్సులో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు ఈ ఏడాది జనవరి 12నుంచి నెలాఖరువరకు పరీక్షలు నిర్వహించారు. జవాబుపత్రాలు వాల్యుయేషన్ కోసం పరీక్షల విభాగానికి పంపారు. వాల్యుయేషన్ కంటే ముందుగా పరీక్షల విభాగంలో (దూరవిద్య) క్యాంపులో జవాబుపత్రాలను కోడింగ్, డీ కోడింగ్ చేస్తారు. ఇదిలా ఉండగా ఈ బీఎల్ఐఎస్సీ పరీక్షను క్యాంపస్‌లోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగి రాశాడు. పరీక్షలు బాగా రాయకపోవడంతో ఫెయిలవుతానని నిర్ధారించుకున్నాడు. ఎలాగైనా పాసవ్వాలని నాలుగు సబ్జెక్టులకు సంబంధించి ఇంటి వద్ద యూనివర్సిటీకి చెందిన ఆన్సర్ బుక్‌లెట్‌లలోనే జవాబులు రాసుకున్నాడు. పరీక్షల విభాగంలో సంబంధిత సెక్షన్‌లో పనిచేసే ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులను మచ్చిక చేసుకున్నాడు. వారికి డబ్బు ఎర చూపి సదరు ఉద్యోగి ఇచ్చిన నాలుగు సబ్జెక్టుల జవాబుపత్రాల బుక్‌లెట్‌లను తీసుకెళ్లి అంతకు ముందు ఆ ఉద్యోగి పరీక్షలో రాసిన ఆన్సర్ బుక్‌లెట్లను తొలగించి వాటిస్థానంలో చేర్చారు. వాల్యుయేషన్ పూర్తయ్యాక గత జూన్ 24న ఫలితాలు విడుదల చేశారు. 231మంది విద్యార్థులకుగాను 88 మంది ఉత్తీర్ణత సాధించారు.

అయినా ఫెయిలయ్యాడు..

తీరా ఫలితాలు చూసుకున్న సదరు ఉద్యోగి అవాక్కయ్యాడు. మార్చిన ఆన్సర్ షీట్లలో రెండు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. జవాబులన్నీ కరెక్టే రాశాను కదా ఎలా ఫెయియ్యాననేది అంతుపట్టక.. తరచూ పరీక్షల విభాగంలోని అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్‌కు ఫోన్ చేశాడు. తాను పరీక్ష బాగా రాశాను.. ఎలా ఫెయిల్ అవుతాను అంటూ చెప్పినట్లు సమాచారం. ఫలితాలు సరిగానే ఇచ్చామని అదనపు పరీక్షల నియంత్రణాధికారి చెప్పారని తెలుస్తోంది. అయినప్పటికీ మళ్లీ, మళ్లీ ఫోన్‌లు చేసి అడుగుతుండటంతో వారికి అనుమానం వచ్చింది. ఆ ఉద్యోగి రాసిన ఆన్సర్ బుక్‌లెట్లను పరిశీలించారు. నాలుగు సబ్జెక్టుల ఆన్సర్ బుక్‌లెట్‌లను మార్చినప్పుడు ఆ దినసరి వేతన ఉద్యోగులు కోడింగ్, డీకోడింగ్‌ను తప్పుగా ముద్రించారు. దీంతో ఒక సబ్జెక్టుకు బదులుగా మరో సబ్జెక్టుకు కోడింగ్ కావడం వల్ల ఒక అధ్యాపకుడు దిద్దే సబ్జెక్టుకు మరో సబ్జెక్టు ఆన్సర్‌షీట్ వెళ్లడంతో వాల్యుయేషన్‌లో ఫెయిల్ చేసినట్లు గుర్తించారు. మార్చిన వాటిలో మరో రెండు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించాడు.

విధులనుంచి తొలగించి సెల్‌ఫోన్‌లు స్వాధీనం

పరీక్షల విభాగంలో ఆన్సర్‌షీట్లను మార్చిన ఇద్దరి దినసరి వేతన ఉద్యోగులను గుర్తించిన పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి.. వారినుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆన్సర్‌షీట్లను ఎలా మార్చారు.. ఎవరు ఇచ్చారు. మార్చినందుకు ఎంత డబ్బులు ముట్టాయన్న సమాచారం రాబట్టినట్లు తెలిసింది. ఆ తరువాత వారిద్దరిని విధులనుంచి తొలగించారు. ఇంకా ఏదైనా పరీక్షల జవాబుపత్రాలు మార్చి ఉంటారా అనే కోణంలో కూడా విచారించినట్లు తెలుస్తోంది. ఆన్సర్ షీట్లను మార్పిడి చేయించుకున్న మహిళా ఇంజనీరింగ్ కళాశాల రెగ్యులర్ ఉద్యోగుస్తుడిని కూడా పిలిపించి మాట్లాడారని, అతను అంగీకరించినట్లు సమాచారం. ఈ వ్యవహారం జూలైలో బయటపడినట్లు యూనివర్సిటీ వర్గాల ద్వారా తెలిసింది.

ఆన్సర్ బుక్‌లెట్లు ఎలా వచ్చాయి?

పరీక్షలు జరిగినప్పుడే ఆ ఉద్యోగి ఇన్విజిలేటర్ల కళ్లు కప్పి మిగులుగా ఉండే ఆన్సర్‌బుక్‌లెట్లను తీసుకెళ్లాడని తెలుస్తోంది. లేకపోతే ఎవరైనా సహకరించారా అన్నది తెలియాలి. కాగా, ఇదంతా విచారణ జరుగుతుండగా పరీక్షల విభాగంలో పనిచేసే మరో దినసరి వేతన ఉద్యోగి విధులకు రాకుండా వెళ్లిపోయాడు. అతడు కూడా ఏమైనా చేసి ఉంటారనే కోణం కూడా ఉంది.

విచారణ కమిటీ నియామకం : నివేదిక అందజేత

ఈ వ్యవహారంపై కొన్నినెలల క్రితమే యూనివర్సిటీ అధికారులు విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీలో పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్ బాబు, మరో ప్రొఫెసర్ ఉన్నారని సమాచారం. వీరు విచారణ పూర్తిచేసి నివేదికను ఇటీవల వీసీ, రిజిస్ట్రార్‌లకు అందజేశారు. ఇంత జరిగినా విషయాన్ని బయటికి పొక్కనివ్వకుండా గోప్యంగా ఉంచడం గమనార్హం.

స్టేకు నిరాకరిస్తూ నోటీసులు జారీ

మంగపేట: మండల పరిధిలోని 23 రెవెన్యూ గ్రామాలు రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పరిధిలోకే వస్తాయని హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ గత నెల 22న సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టులో మంగళవారం జస్టిస్ బేలా త్రివేది బెంచ్ విచారణకు స్వీకరించి ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు పరిగణలోకి తీసుకున్న కోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరిస్తూ కేవలం నోటీసులు జారీ చేసినట్లు డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు శ్రావణ్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

స్విట్జర్లాండ్ వర్క్‌షాప్‌లో బాలవికాస శౌరిరెడ్డి

కాజీపేట రూరల్: స్విట్జర్లాండ్ ప్రభుత్వం మంచినీటి రంగంలో డిజిటలైజేషన్ అండ్ డేటా విశ్లేషణపై ఆ దేశంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి పాల్గొన్నారు. బాలవికాస నీటి శుద్ధీకరణ పథకాలను వివరించారు. బాలవికాస కమ్యూనిటీ శుద్ధిత నీటి పథకాలను 2004లో ప్రారంభించి నేటికి 1,550 గ్రామాల్లో సుమారు 30 లక్షలపేద ప్రజలకు శుద్ధమైన నీటిని అందిస్తున్నట్లు వివరించారు. స్విట్జర్లాండ్‌లో నీటి నిర్వహణపై స్విస్ ఏజెన్సీ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ కార్పొరేషన్ (ఎస్‌డీసీ) వారు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే 37వ అగ్వాసాన్ 2023 నీటి సదస్సులో ఆహ్వానం మేరకు వెళ్లినట్లు శౌరిరెడ్డి తెలిపారు.

న్యాయవాది అరెస్ట్

డోర్నకల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన న్యాయవాది తేజావత్ రమేష్‌ను అరెస్ట్ చేసినట్లు డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. డోర్నకల్‌లో ఈనెల 3వ తేదీ రాత్రి తేజావత్ రమేష్.. ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడి పరారయ్యారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని రమేష్ ఆచూకీ కోసం ఎస్‌పీడీపీఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. ఆ బృందం మంగళవారం హైదరాబాద్‌లో రమేష్‌ను అరెస్ట్ చేసి మహబూబాబాద్ కోర్టులో హాజరుపర్చమన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్ నిమిత్తం జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ట్యాగ్ సిస్టం అమలుతో సత్ఫలితాలు

కాజీపేట: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) నుంచి ఇతర రాష్ట్రాలకు గూడ్స్ ద్వారా చేపడుతున్న బియ్యం రవాణా సత్ఫలితాలు ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎఫ్‌సీఐ గోడౌన్లలో నిల్వ చేసిన బియ్యం కొద్ది కాలంగా ప్రత్యేక రేకుల్లో ఎగుమతి చేస్తున్నారు. ఈ సమయంలో బియ్యం చోరీకి గురికాకుండా రైల్వే శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బియ్యం నిల్వలపై ట్యాగింగ్ సిస్టం అమలు చేస్తోంది. గతంలో రైలు రేకులకు (బోగీలు) లాక్‌లు వేసి లక్క సీళ్లు వేసి సుదూర ప్రాంతాలకు రవాణా చేసేవారు. వీటిని దొంగలు సునాయసంగా తొలగించి బియ్యం అపహరించుకెళ్లేవారు. ఈ నష్టాన్ని రైల్వే శాఖ భరించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో ఇటీవల ఎఫ్‌సీఐ నుంచి బియ్యం రవాణా చేసే సమయంలో రేకులకు ట్యాగులు వేసి జీపీఎస్ కనెక్షన్లు ఇస్తున్నారు. ఫలితంగా ఎక్కడైనా దొంగలు ట్యాగ్‌లను తొలగించి చోరీకి ప్రయత్నిస్తే అధికారులకు సమాచారం అందుతోంది. తద్వారా నష్టాన్ని సకాలంలో నివారిస్తున్నారు. కాగా, వరంగల్ జిల్లా నుంచే మొదటిసారి ఈ విధానాన్ని అమలు చేశారు. విజయవంతం కావడంతో దేశ వ్యాప్తంగా అమలు చేయడానికి రైల్వే అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

నగదు పట్టివేత..


గీసుకొండ: వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు


గూడూరు: చెక్‌పోస్టు వద్ద డబ్బు చూపుతున్న వ్యక్తి

తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. బైక్ నుంచి మొదలు.. బస్సు వరకూ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆధారాలు లేకుండా తరలించిన నగదు, బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. యజమానులు ఈ డబ్బు, ఆభరణాలకు ఆధారాలు చూపిస్తే అప్పగిస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు నగదు, బంగారం, వెండి ఆభరణాలను ఆధారాలు లేకుండా తీసుకెళ్లొద్దని ఈ సందర్భంగా పోలీసులు కోరారు.

ఊకల్ క్రాస్ వద్ద రూ. 3.45 లక్షలు..

గీసుకొండ: మండలంలోని ఊకల్ క్రాస్ వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ. 3,45 లక్షలు స్వాధీనం చేసుకున్నామని గీసుకొండ ఎస్సై వెంకన్న తెలిపారు. మంగళవారం క్రాస్ వద్ద వాహన తనిఖీల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జొన్నగడ్డల మల్లికార్జున శాస్త్రి అనే వ్యక్తి కారును తనిఖీ చేయగా రూ. 3,45 లక్షలు లభ్యమయ్యాయన్నారు. దీంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

పరకాలలో రూ.3.26 లక్షలు..

పరకాల: ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.26 లక్షల నగదును పరకాల పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఫర్టిలైజర్ వ్యాపారి సూర కిరణ్ వద్ద రూ.లక్షా 41వేలు, కిరాణ వ్యాపారి బోయిని రమేష్ వద్ద రూ.85 వేలు, వస్త్ర వ్యాపారులు బరిశెట్టి స్వరూప వద్ద రూ.50వేలు, పాశికంటి రవీందర్ వద్ద రూ.49వేలు స్వాధీనం చేసుకున్నట్లు పరకాల సీఐ వెంకటరత్నం తెలిపారు.

పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రూ. 7.50 లక్షలు..

రామన్నపేట : ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ జంక్షన్‌లో మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మడికొండకు చెందిన ముగుల వేణు వద్ద రూ. 3 లక్షలు, మట్రి వెంకటయ్య కాలనీకి చెందిన బాబుల సుదర్శన్ వద్ద నుంచి రూ. 4.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

వెలికట్టలో 4.50 లక్షలు..

తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట శివారులోని పాలకేంద్రం సమీపంలో ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిపై పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధారాలు చూపని నగదు, బంగారం, వెండి పట్టుబడింది. బస్సులో ఓ వ్యక్తి రూ. 3.50 లక్షలు, కారులో మరో వ్యక్తి రూ. 1 లక్ష, బైక్ వెళ్తున్న మరో వ్యక్తి వద్ద 10 గ్రాముల బంగారం, 750 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. ఈ డబ్బు, బంగారం, వెండికి సంబంధించి ఎలాంటి ఆధారాలు తెలుపకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని సీఐ సత్యనారాయణ, ఎస్సై జగదీష్ తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భూపతిపేట వద్ద రూ. 4.50 లక్షలు..

గూడూరు: మండలంలోని భూపతిపేట ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో ఓ పత్తి వ్యాపారి వద్ద రూ. 4.50 లక్షలు లభ్యమయ్యాయని సీఐ సీఐ ఫణిధర్ తెలిపారు. అయితే ఆ డబ్బుకు ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాణాప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణపురం వద్ద 2.50 లక్షలు స్వాధీనం..

బయ్యారం : ఇల్లందు–మహబూబాబాద్ రహదారిపై మండలంలోని సత్యనారాయణపురం వద్ద పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధారం చూపని రూ. 2.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఓ ఫెస్టిసైడ్స్ ఉద్యోగి తన కారులో 2.50 లక్షలు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో గార్ల, బయ్యారం సీఐ బాబురావు, ఎస్సై ఉపేందర్ కారును తనిఖీ చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ డబ్బు కలెక్షన్‌కు సంబంధించిందని ఫెస్టిసైడ్స్ ఉద్యోగి తెలుపగా.. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

తీగరాజుపల్లి వద్ద రూ. 2లక్షలు..

సంగెం: ఆధారాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.2 లక్షల నగదును సీజ్ చేసినట్లు సంగెం ఎస్సై ఎం. భరత్ తెలిపారు. మంగళవారం సాయంత్రం వరంగల్– మహబూబాబాద్ ప్రధాన రహదారిపై తీగరాజుపల్లి వద్ద వాహన తనిఖీ చేపట్టారు. ఇందులో హనుమకొండ నుంచి నెక్కొండ వైపునకు కారులో వెళ్తున్న చెన్నారావుపేట మండలం కందిగడ్డ తండాకు చెందిన గుగులోత్ స్వామి వద్ద రూ. 2 లక్షలు లభించినట్లు తెలిపారు. ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్‌చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మరిపెడలో రూ.లక్ష..

మరిపెడ: ఖమ్మం జిల్లా నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న ఓ కారులో మరిపెడ మండల కేంద్రంలో రూ. లక్ష స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పవన్ మంగళవారం తెలిపారు. ఈ డబ్బుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఆధారాలు చూపితే అప్పగిస్తామన్నారు.

హనుమకొండ పీఎస్ పరిధిలో రూ. లక్ష..

వరంగల్ క్రైం : ఎన్నికల కోడ్ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉదయం నుంచి రాత్రి వరకూ పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా హనుమకొండ పీఎస్ పరిధిలోని బస్టాండ్ వెనుక రామిడి సానిత్ అనే వ్యక్తి వద్ద రూ. లక్ష లభించడంతో స్వాధీనం చేసుకున్నామని సీఐ కరుణాకర్ తెలిపారు. ఆధారాలు చూపితే ఆ డబ్బు అప్పగిస్తామన్నారు. అలాగే, కమిషనరేట్ పరిధిలోని పలు చోట్లలో డబ్బు పట్టుబడినట్లు తెలిసింది.

కోరుకొండపల్లి క్రాస్ వద్ద రూ.80 వేలు..

కేసముద్రం: మండల కేంద్రంలోని కోరుకొండపల్లి క్రాస్ వద్ద మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద లభ్యమైన రూ.80 వేలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు. వరంగల్‌కు చెందిన తోట రవి.. వరంగల్ నుంచి ఆర్టీసీ బస్సులో కేసముద్రం మండల కేంద్రానికి వస్తుండగా, కోరుకొండపల్లి క్రాస్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో అతడి బ్యాగులో రూ.80వేలు లభ్యమయ్యాయన్నారు. దీంతో ఆ డబ్బుకు ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామని ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి

విద్యుదాఘాతంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం ముగ్గురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.


రమేష్ (ఫైల్)

ఏటూరునాగారం: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రాంనగర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన గార రమేష్ (40) రెండు ఎకరాల భూమిలో మిర్చి పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పంటకు తడి కట్టడానికి వెళ్లాడు. విద్యుత్ మోటార్‌ను ఆన్ చేయడానికి స్టార్టర్‌ను ముట్టుకున్న క్రమంలో షాక్ వచ్చి కిందపడ్డాడు. రమేష్ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో భార్య సుజాత విద్యుత్ మోటారు వద్దకు వెళ్లి చూడగా కిందపడి ఉన్నాడు. దీంతో రమేష్‌ను వెంటనే ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

మైలారంలో మరో రైతు..

కొత్తగూడ: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని మైలారంలో జరిగింది. గ్రామానికి చెందిన రమాకాంత్(35) తన పొలానికి పారించడానికి వెళ్లాడు. ఈ క్రమంలో మోటార్ ఆన్ చేసేందుకు యత్నించి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై నగేష్ ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నగేష్ తెలిపారు.


రమాకాంత్(ఫైల్)

వంగపహాడ్‌లో మేస్త్రీ..

హసన్‌పర్తి: విద్యుదాఘాతానికి గురై ఓ తాపీ మేస్త్రీ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని వంగపహాడ్‌లో జరిగింది. గ్రామానికి చెందిన దోమ శ్రీను(53) స్థానికంగా ఓ ఇంట్లో తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ విద్యుదాఘాతానికి గురై అక్కడక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.


శ్రీను (ఫైల్)

16న జనగామ, 27న ఘన్‌పూర్‌లో సీఎం బహిరంగ సభలు..

సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్‌ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఈ నెల 16వ తేదీనుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏర్పాటుచేసిన పలు బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. మొదటి దశలో రెండు నియోజకవర్గాల్లో ఆయన పర్యటించనున్నారు. ఇప్పటికే అధిష్ఠానం ఉమ్మడి జిల్లా పరిధిలో 12 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఎన్నికల షెడ్యూల్ రావడంతో ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో తొమ్మిదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ, మళ్లీ బీఆర్‌ఎస్‌కే ఓటు వేసేలా కేసీఆర్ ఎన్నికల ప్రచారం సాగనుందన్న చర్చ జరుగుతోంది. ఈ నెల 15న సీఎం .. హుస్నాబాద్‌లో మొదటి బహిరంగ సభలో పాల్గొంటారు. మరుసటి రోజు 16వ తేదీన జనగామ జిల్లాలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం 27వ తేదీన స్టేషన్ ఘన్‌పూర్‌లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు బహిరంగ సభ ఉంటుంది.

ఇంజక్షన్ వికటించి వివాహిత మృతి

- కుటుంబ సభ్యుల ఆరోపణ
- న్యాయం చేయాలని డిమాండ్


స్వాతి(ఫైల్)

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన శ్యామల స్వాతి(23) ఇంజక్షన్ వికటించి మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రెండు రోజుల నుంచి జ్వరం వస్తుండడంతో స్వాతి చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ప్రవంతి నర్సింగ్ హోమ్‌లో చేరింది. దీంతో ఆమె రక్తాన్ని టెస్ట్ చేయగా మలేరియా, డెంగీ నెగెటివ్ వచ్చాయి. అయితే ప్లేట్స్ లెట్స్, బీపీ తక్కువగా ఉండడంతో సాయంత్రం వైద్యుడు వరప్రసాద్ చికిత్స నిర్వహించారు. బీపీ అదుపులోకి రావడానికి ఇంజక్షన్ ఇవ్వగా ఆమె మృతి చెందింది. ఈ విషయంపై మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు వరప్రసాద్‌ను నిలదీశారు. ఇంజక్షన్ చేసిన తర్వాతే స్వాతికి మాట రాలేదని, పిచ్చిగా అరిచిందని తెలిపారు. వరంగల్ తీసుకెళ్తుంటే మృతి చెందిందని ఆరోపించారు. ఈ విషయంపై డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ తాను ఎలాంటి తప్పుడు ట్రీట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. ఒక్కొకసారి రిపోర్ట్‌లో నెగెటివ్ వచ్చినా పరిస్థితి విషమిస్తుందన్నారు. బీపీ తక్కువగా ఉండడం వల్ల ఇంజక్షన్ చేసి వరంగల్‌కు తీసుకెళ్లాలని చెప్పానన్నారు. స్వామి మృతి విషయంలో తన నిర్లక్ష్య ఏమీ లేదన్నారు. ఈ విషయంపై డీఎంహెచ్‌ఓ అప్పయ్యను వివరణ కోరగా బాధితులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, మృతురాలికి భర్త కార్తీక్, కూతురు ఉంది.

విష జ్వరంతో ఇద్దరు మృతి..


మనోహర్(ఫైల్)

వాజేడు: విష జ్వరంతో ఇద్దరు మృతి చెందారు.ఈ ఘటన మండలంలోని చెరుకూరులో జరిగింది. గ్రామానికి చెందిన మాద మనోహర్ (20), మాద జగదాంబ(50) ఐదు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నారు. దీంతో స్థానికంగా వైద్యం పొందారు. అయినా తగ్గకపోవడంతో ఏటూరునాగారం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మనోహర్, మంగళవారం జగదాంబ మృతి చెందారు.

బావిలో పడి యువతి..

మహబూబాబాద్ రూరల్: బావిలో పడి ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ మండలం సంద్రలగూడెం గ్రామ శివారు పూరితండాలో జరిగింది. తండాకు చెందిన భూక్య వీరేందర్, రాధ (27) దంపతులు. తమ రెండెకరాల వ్యవసాయ భూమిలో మిర్చి, పత్తి సాగు చేశారు. వీరేందర్.. మిరప తోటకు మందు కొడుతుండగా రాధ బావి నుంచి నీరు తీసుకొచ్చి పంపులో పోస్తోంది. ఈ క్రమంలో బావి వద్దకు వెళ్లి నీళ్లు తోడుతూ అందులో జారి పడింది. ఎంతకూ రాకపోవడంతో వీరేందర్ అనుమానం వచ్చి బావి దగ్గరికి రాగా రాధ అందులో పడి ఉంది. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.


రాధ(ఫైల్)

బతుకమ్మ చీరల పంపిణీ

- అడ్డుకున్న మహిళలు
- కోడ్ ఉల్లంఘన కాదా..
- పంపిణీ నిలిపివేయాలని మాజీ మంత్రి సురేఖ డిమాండ్

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లోని నగర పాలక సంస్థ కమ్యూనిటీ హాల్‌లో బల్దియా ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. మీ ఇంట్లో మీ ఆడవారు కట్టే చీరే ఇలానే ఉంటాయా అంటూ మహిళలు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. నాసిరకం చీరల పంపిణీని తక్షణమే నిలిపివేయాలని మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న మాజీ మంత్రి కొండా సురేఖ కరీమాబాద్ అక్కడికి చేరుకొని చీరలను పరిశీలించారు. చీరలను ప్యాక్ చేసిన కవర్‌పై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, కవిత ఫొటోలతో కూడిన చీరలు పంచడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ మహిళలకు పంపిణీ చేయడం కోడ్ ఉల్లంఘనే కదా.. ఎన్నికల అధికారులు తక్షణమే పంపిణీ నిలిపివేయాలన్నారు. లేకుంటే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద అధికారులకు ఫిర్యాదు చేస్తామని సురేఖ హెచ్చరించారు.


చీరను చూపిస్తున్న కొండా సురేఖ

నేడు సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

నయీంనగర్: తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను హనుమకొండలోని నయీంనగర్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభిస్తారని, ప్రముఖ సినీతార రాశీఖన్నా జ్యోతిప్రజ్వలన చేస్తారని మేనేజర్ ఫణి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, అరూరి రమేష్, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు, భద్రకాళీ శేషు, ఎస్.రామ్మూర్తి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మైనారిటీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఖుస్రుపాషా


ఇమ్రాన్ ప్రతాప్‌ఘరీతో ఖుస్రుపాషా

న్యూశాయంపేట : రాబోయే ఎన్నికల్లో మైనారిటీలకు తెలంగాణలో ఉమ్మడి జిల్లాకు ఒక్కటి చొప్పున కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ సీట్లు కేటాయించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా అన్నారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో ఆల్ ఇండియా కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్‌మెంట్ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్‌ఘరీని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మైనారిటీలకు రాజకీయ ప్రాధాన్యం తగ్గిందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మైనారిటీలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని తెలిపారు. అందుకే కాంగ్రెస్ పార్టీ మైనారిటీలకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలని ఖుస్రూపాషా కోరారు.

బీజేపీకి పెరుగుతున్న ఆదరణ

- పార్టీ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్


పార్టీలో చేరిన వారితో బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు పద్మ, కొండేటి శ్రీధర్

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్ అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని రావు పద్మ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేత పుప్పాల రజనీకాంత్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. వీరికి రావు పద్మ, కొండేటి శ్రీధర్ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అనూహ్య విజయం సాధిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత ఉందన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీవైపు చూస్తున్నారన్నారు. నాయకులు దండ విజయ, విజేందర్‌రెడ్డి, జన్నత శ్రీనివాస్, జినుకల లక్ష్మణ్ రావు, చెలుమల్ల సమ్మయ్య, పచ్చిక సురేందర్ రెడ్డి, గాండ్ల సంతోష్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్త దశరథం, మహేందర్, కోల సురేందర్, గురిజాల మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, హరినాథ్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన జిల్లా పురుషుల జట్టుతో సంఘం బాధ్యులు

హన్మకొండ: సూర్యాపేట జిల్లా కోదాడలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపల్లి రాజు, జోలి సాంబయ్య తెలిపారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని సెయింట్ గాబ్రియల్స్ హైస్కూల్ మైదానంలో ఆదివారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు. పురుషుల జట్టులో కె. యశ్వంత్, ఎం. దిలీప్, బి. హరిప్రసాద్, కె. త్రిలోక్, టి. రాము, బి సుమన్, జి. దినేష్, ముజామిల్, టి. రాహుల్, సిహెచ్. శ్రీవర్ధన్, డి. సాగర్, ఎ. వంశీ, స్టాండ్‌బైలుగా ఎల్, తిరుపతి, డి. గ్రీష్మాంత్, ఎండి. సాధాక్ పాషా ఎంపికయ్యారు. మహిళల జట్టులో టి. మీనాక్షి, జి. దీక్షిత, జి. మేరీ హాసినిరెడ్డి, జె. తేజస్వీ, కె. యుక్తశ్రీ, కె, బ్రిన్దా, పి వేలిక, ఎం. దివ్య, కె. జ్యోతి, పి.అంజలి, జి. వైశాలీ, కె. కల్యాణి, స్టాండ్‌బైలుగా బి షారోన్, ఆర్. అశ్విని ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి భాస్కర్, పీఈటీ లు విజయ్‌కుమార్, సునీల్, కోచ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పరిశోధనలకు 'నిట్' వేదికవ్వాలి


కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కోమల్ కపూర్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్.. పరిశోధనలకు ప్రపంచస్థాయిలో వేదికవ్వాలని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ హైదరాబాద్ చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్ తెలిపారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో నిట్ వరంగల్ 65వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 1959 అక్టోబర్ 10వ తేదీన అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాన చేసిన నాటి ఆర్‌ఈసీ.. తన ప్రత్యేకతను చాటుకుంటే నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీగా ఆవిర్భవించడం.. నేడు 65వ వసంతంలోకి అడుగుపెట్టడం అభినందనీయమన్నారు. తాను పని చేస్తున్న హైదరాబాద్ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్.. దేశానికి తోడ్పడుతున్నట్లే నిట్ వరంగల్ విద్యార్థులు తమ పరిశోధనలతో దేశానికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, డీన్ శ్రీనివాసాచార్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు తల్లి, కుమారుడి అప్పగింత


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సతీష్

మహబూబాబాద్ రూరల్: తల్లి, కుమారుడు తప్పిపోయారని నమోదైన కేసులో వారిద్దరిని గుర్తించిన మహబూబాబాద్ టౌన్ పోలీసులు.. మంగళవారం రాత్రి తమిళనాడు పోలీసులకు అప్పగించారు. టౌన్ సీఐ వై.సతీష్ కథనం ప్రకారం తమిళనాడులోని దిండిగల్ జిల్లా గుజిలంపారి పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న మణిమేఘలై తన ఏడాది కుమారుడు రుత్విక్‌తో సహా ఈ ఏడాది జూలై 23వ తేదీన అదృశ్యమైంది. దీంతో ఆమె కోసం వెతికితే ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి సుబ్రమణ్యం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీప ప్రాంతం నుంచి గుజిలంపారి పోలీసులకు ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే అక్కడి పోలీసులు ఆ ఫోన్ కాల్ సమాచారాన్ని టౌన్ సీఐ వై.సతీష్‌కు తెలిపారు. ఆయన వెంటనే స్పందించి బ్లూకోల్ట్స్ పీసీలు నాగరాజు, రాంబాబును ఘటనా స్థలికి పంపి విచారించారు. ఆ సమయంలో ఆ తల్లి కుమారుడితో పాటు తమిళనాడులోని పరంధాడి గ్రామానికి చెందిన పళనిస్వామి కూడా ఉన్నట్లు గుర్తించారు. సదరు వ్యక్తి మణిమేఘలైకి మాయమాటలు చెప్పి ఇక్కడికి తీసుకువచ్చినట్లు విచారణలో తెలిసింది. దీంతో తల్లి, కుమారుడిని సఖి కేంద్రానికి అప్పగించి ఆ వ్యక్తిని టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రాత్రి గుజిలంపారి ఎస్సై కళై అరసం, హెడ్ కానిస్టేబుల్ కళైవాణి, కానిస్టేబుల్ ఫ్రాంచీస్ సమక్షంలో ఆ ముగ్గురిని అప్పగించారు. నిందితుడు పళనిస్వామిని మద్రాసు హైకోర్టులో ప్రవేశపెడుతామని అక్కడి పోలీసులు తెలిపారు. ఫోన్‌కాల్ వచ్చిన వెంటనే స్పందించి బాధితులను కనుగొన్న మహబూబాబాద్ పోలీసులకు తమిళనాడు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టౌన్ ఎస్సైలు విజయ్‌రాంకుమార్, రామారావు, తాహేర్‌బాబా, దీపికారెడ్డి, పీసీలు జ్యోతి, సరిత పాల్గొన్నారు.


ప్రమీలా ప్రభు

శత్రు దేశాలు, ఉగ్రమూకలు, తీవ్రవాదులు విరుచుకుపడినప్పుడు ఎంత శక్తిమంతమైన దేశమైనా అల్లకల్లోలంగా మారిపోతుంది. ఆ మధ్యన అఫ్ఘానిస్థాన్ పరిస్థితి ఇలానే ఉండేది. అది మర్చిపోయే లోపు ఉక్రేయిన్ రష్యా యుద్ధం మొదలై నేటికీ కొనసాగుతూనే ఉంది. అఫ్ఘానిస్థాన్, ఉక్రెయిన్‌లలో ఏర్పడిన పరిస్థితులకు భయపడిపోయిన చాలామంది ప్రజలు ప్రాణాలు అరచేత బట్టి దేశం విడిచి పారిపోయారు. ఇక ఆయా దేశాల్లో ఉన్న విదేశీయులు ముందుగానే పెట్టే బేడా సర్దుకుని తమ తమ దేశాలకు పరుగెత్తుకెళ్లారు. ప్రస్తుతం ఇజ్రాయెల్ పరిస్థితి కూడా ఇలానే ఉంది. అయినా అక్కడ నివసిస్తోన్న 41 ఏళ్ల ప్రమీలా ప్రభు మాత్రం "నేను ఇండియా రాను. ఇక్కడే ఉండి సేవలందిస్తాను" అని ధైర్యంగా చెబుతోంది.

పారిపోను.. సాయం చేస్తా



కర్ణాటకలోని ఉడిపి జిల్లా.. హెర్గాలో పుట్టి పెరిగింది ప్రమీలా ప్రభు. మైసూర్‌లో చదువుకుంది. చదువు పూర్తయ్యాక ఉడిపిలోని మణిపాల్ ఆసుపత్రిలో నర్స్‌గా చేరింది. కొన్నాళ్లు ఇక్కడ పనిచేశాక, ఇజ్రాయేల్‌లో మంచి జీతంతో ఉద్యోగం దొరకడంతో.. తన ఇద్దరు పిల్లలతో ఇజ్రాయెల్‌కు వెళ్లింది. గత ఆరేళ్లుగా అక్కడే ఉంటోన్న ప్రమీలా ఆ దేశం మీద అక్కడి ప్రజల మీద మమకారం పెంచుకుంది. అందుకే పరిస్థితులు దారుణంగా ఉన్నప్పటికీ ... ''ఇండియా నాకు జన్మనిస్తే.. ఇజ్రాయెల్ జీవితాన్నిచ్చింది. ఇలాంటి కష్ట సమయంలో దేశాన్ని వదిలి రాను. నేను చేయగలిగిన సాయం చేస్తాను'' అని కరాఖండిగా చెబుతూ అక్కడి పరిస్థితులను ఇలా వివరించింది....

నేను టెల్ అవీవ్ యాఫోలో నివసిస్తున్నాను. అక్టోబర్ 7తేదీన రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో భోజనం చేశాము. అప్పుడు ఎమర్జెన్సీ సైరన్ వినిపించింది. వెంటనే మేమంతా బంకర్‌లోకి వెళ్లిపోయాము. దాదాపు రాత్రంతా సైరన్ వినిపిస్తూనే ఉంది. నేను ఇజ్రాయెల్ వచ్చాక ఇంతపెద్ద హింసను ఎప్పుడూ చూడలేదు. మా ఇంటికి కిలోమీటర్ దూరంలో బాంబులు పడుతున్నాయి. పెద్దపెద్ద శబ్దాలు ఒక్కసారిగా భయపెట్టేశాయి. ఇక్కడ ప్రతి ఇంటికి బంకర్‌లు ఉన్నాయి. పబ్లిక్ ప్లేసుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బంకర్లు కూడా ఉన్నాయి. ఎమర్జెన్సీ సమయంలో ఎవరైనా వీటిలోకి వెళ్లి తలదాచుకోవచ్చు. సైరన్ మోగిన వెంటనే కనీసం ముప్పైసెకన్ల పాటు బాంబుల శబ్దాలు వినపడుతున్నాయి. దశాబ్దకాలంగా ఇజ్రాయెల్‌పై తీవ్రవాద సంస్థ హమాస్ దాడులకు తెగబడుతూనే ఉంది. హమాస్ వల్ల గాజా కూడా దాడులతో కొట్టుమిట్టాడుతూనే ఉంది. ఇప్పటికే వెయ్యిమందికిపైగా చనిపోయారు. ఇక్కడి ప్రజలు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. టెల్ అవీవ్‌లో షాపులు అన్నీ మూసేసారు. వీధుల్లో అక్కడక్కడ ఒకరిద్దరు మాత్రమే విక్రయాలు జరుపుతున్నారు. అందరూ కిరాణా సామాన్లు తెచ్చుకుని నిల్వ చేసుకుంటున్నారు.

అరగంట లోపలే...

మా చెల్లి ప్రవీణ జెరుసలేంలోని ఓ ఆసుపత్రిలో పనిచేస్తోంది. నేను టెల్ అవీవ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాను. ఈ అపార్ట్‌మెంట్‌లో ముప్పైమంది వరకు ఉన్నారు. మేమంతా అత్యవసరమైన ఆహారం, నీళ్లు, టార్చ్‌లైట్ వంటివాటిని దగ్గర ఉంచుకుని బేస్‌మెంట్ తలుపులు తెరుచుకుని ...సైరన్ రాగానే బంకర్‌లోకి పరుగెడుతున్నాం. సైరన్ ఆగినప్పుడు బంకర్‌ల నుంచి బయటకు వస్తున్నాం. బంకర్‌లోకి వెళ్లిన ప్రతిసారి అరగంట పాటు లోపలే ఉండాల్సి వస్తోంది.

ఊహకందని దాడి

ఇజ్రాయెల్‌మీద పాలస్తీనా దాడులు చేయడం ఇది కొత్తేమీ కాదు. కానీ ఇప్పుడు జరిగిన దాడి అస్సలు ఊహించలేదు. ఊహకందని వికృతదాడికి హమాస్ సంస్థ పాల్పడింది. దక్షిణ ఇజ్రాయెల్‌లో శాంతికోసం ఏర్పాటు చేసిన 'మ్యూజిక్ ఫెస్టివల్'ను ఇలా అశాంతిగా మారుస్తారని అసలు ఊహించలేదు. ఆ ఫెస్టివల్ గురించి అత్యంత బాధాకరమైన వార్తలు వినాల్సి వస్తోంది. ఇజ్రాయెల్ ఎప్పుడూ.. యుద్ధానికి అన్నివేళలా సన్నద్ధమై ఉండి, రక్షణాత్మక చర్యలను పర్యవేక్షిస్తుంటుంది. లేదంటే మరింతమంది హమాస్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయేవారు.

ఇప్పుడు రాలేను..

ఇజ్రాయెల్ నాకు జీవితాన్నిచ్చింది. వీరు కష్టాల్లో ఉన్నప్పుడు నేను నా మాతృదేశం వచ్చి సంతోషంగా ఉండలేను. ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుమతిస్తే నా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాను. ఉడిపిలో ఉన్న మా కుటుంబ సభ్యులు పదేపదే ఫోన్ చేస్తున్నారు. నేను క్షేమంగా ఉన్నానా... లేదా... అని కంగారు పడుతున్నారు. ఇక నా పిల్లలు ఇండియా వెళ్లిపోయారు. వారిని విడిచి ఇక్కడ ఉన్నాను. వాళ్లంతా గుర్తొస్తున్నారు. అయినా ఇంతటి విపత్కర పరిస్థితుల నుంచి పారిపోవాలనుకోవడం లేదు. పరిస్థితులు చక్కబడిన తరువాత ఇండియా తిరిగి రావడం గురించి ఆలోచిస్తాను'' అని చెబుతూ ఎంతోమంది స్ఫూర్తిగా నిలుస్తోంది ప్రమీలా ప్రభు.

పురస్కారం




గౌరీ గిల్

లక్ష సైనికుల కోటి కన్నుల కెమెరా

'నా చేతిలో కెమెరా ఉంటే నాకు భయమనేదే లేదు' అనేది ఫొటోగ్రాఫర్ గౌరీ గిల్‌కు ఇష్టమైన మాట.

ఈ కారణం వల్లే కావచ్చు ఆమె ఏ భయమూ లేకుండా మారుమూల పల్లెల నుంచి మహా అరణ్యాల వరకు వెళ్లింది. తన భుజాల మీద కెమెరా ఉంటే, తన చుట్టూ లక్షల సైన్యం ఉన్నట్లే. వర్తమాన చరిత్ర, సంస్కృతి, సంబరాన్ని తన కెమెరా కంటితో పట్టుకుంది గౌరీ గిల్. తన ఫొటో సిరీస్ 'నోట్స్ ఫ్రమ్ ది డిజర్ట్'తో ప్రతిష్ఠాత్మకమైన ప్రిక్స్ పిక్‌టెట్ అవార్డ్ గెలుచుకుంది. స్విట్జర్లాండ్‌కు చెందిన మల్టీనేషనల్ ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ పిక్‌టెట్ 'ప్రిక్స్ పిక్‌టెట్' (ఇంటర్నేషనల్ అవార్డ్ ఇన్ ఫొటోగ్రఫీ)కి 2008లో శ్రీకారం చుట్టింది...

చండీగఢ్‌లో పుట్టిన గౌరి గిల్ ఢిల్లీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో బీఎఫ్ఏ చేసింది. న్యూయార్క్‌లోని 'పార్సన్స్ స్కూల్ ఆఫ్ డిజైన్'లో ఫొటోగ్రఫీలో బీఎఫ్ఏ, స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో ఫొటోగ్రఫీలో ఎంఎఫ్ఏ చేసింది. అమెరికా, ఇండియాలో ఉన్న బంధువులను ఫొటోలు తీయడంతో తన ప్రయాణం మొదలైంది.

రాజస్థాన్‌లోని అట్టడుగు వర్గాల జీవితాలను అధ్యయనం చేసిన తరువాత తాను చేసిన ఫొటో ప్రాజెక్ట్ 'నోట్స్ ఫ్రమ్ ది డెజర్ట్'కు మంచి పేరు వచ్చింది. 'ది మార్క్ ఆన్ ది వాల్' 'జన్నత్'... మొదలైన ఎగ్జిబిషన్‌లు, ప్రాజెక్ట్‌లతో ప్రశంసలు అందుకుంది.

నోట్స్ ఫ్రమ్ ది డెజర్ట్ ప్రాజెక్ట్ విషయానికి వస్తే... ఈ ప్రాజెక్ట్ కోసం రాజస్థాన్‌లోకి అడుగు పెట్టినప్పుడు అక్కడి పరిస్థితుల గురించి పెద్దగా ఏమీ తెలియదు. ఒక్కొక్క అడుగు వేస్తూ అక్కడి సమాజాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించింది. సంచారుల నుంచి రైతుల వరకు ఎంతోమందితో మాట్లాడింది. కాలాలతో పాటు మారే వ్యక్తుల జీవితాలను గమనించింది. తాను పరిశీలించిన జీవితాల గురించి డైరీలో రాసుకుంది.

> 2011లో కెనడాలోని ప్రతిష్ఠాత్మకమైన ఫొటోగ్రఫీ అవార్డ్ గ్రాంజ్ గెలుచుకొని ప్రపంచ దృష్టిని ఆకర్షించిన గౌరికి వినడం ఇష్టమైన పని. విన్న విషయాలను విశ్లేషించుకొని తన కెమెరాకు ముడిసరుకుగా మార్చుకోవడం మరింత ఇష్టమైన పని.

ఆ తరువాత తన కెమెరా ప్రయాణం రాజస్థాన్ మారుమూల ప్రాంతాల నుంచి మహారాష్ట్రలోని ఆదివాసుల ఇళ్ల దగ్గరకు చేరింది. వర్లీ ఆర్ట్‌ను ఒడిసిపట్టుకుంది. ఫలానా ఊళ్లో ఫలానా ప్రత్యేకత ఉందనే మాట చెవికి సోకగానే రెక్కలు కట్టుకొని అక్కడ వాలుతుంది. మోహడా అనే ఊళ్లో గ్రామస్థులు పురాణ పాత్రల మాస్క్‌లను ధరించి పెద్ద ఊరేగింపు తీస్తారు. ఈ మాస్క్‌లనే సబ్జెక్ట్‌గా తీసుకొని ఫొటో ప్రాజెక్ట్ చేసింది. ఒకరోజు ఒక గ్రామంలోని పశువుల ఆస్పత్రికి వెళ్లింది. డాక్టర్ లేదు. అయితే ఆ డాక్టర్ సీట్‌లో దోమ మాస్క్ పెట్టుకొని ఒక వ్యక్తి కూర్చున్నాడు. పేషెంట్ సీట్లో కూర్చున్న వ్యక్తి ఏదో మాస్క్ పెట్టుకున్నాడు. ఆ ఆస్పత్రిలోని పాత సామాను, గోడలకు వేసిన రంగులు, ఆస్పత్రి చుట్టుపక్కల రకరకాల ఆవులు, వాటిని కాచుకు కూర్చున్న రైతులు... ఈ అంశాలన్నీ వచ్చేలా ఫొటోలు తీసింది. ఈ ఫొటోల నుంచి ఆలోచించిన వారికి ఆలోచించినన్ని కోణాలు కనిపిస్తాయి. ఎవరి వ్యాఖ్యానాలూ అవసరం లేకుండానే సమాధానాలు దొరుకుతాయి.

మొదట్లో ఒక పత్రికలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసింది గౌరి. తన ఆసక్తి గ్రామాలు, మారుమూల పల్లెల్లోని స్కూళ్లపై ఉండేది. అయితే తన ఉద్యోగం ద్వారా పల్లెలకు వెళ్లే అవకాశం రాలేదు. దీంతో పల్లెబాట పట్టడానికి ఉద్యోగాన్ని వదిలింది. ఎన్నో స్కూళ్ల చుట్టూ తిరిగింది. 'ఇది స్కూల్ కాదు. ఇదే అసలుసిసలు ప్రపంచం' అనుకుంది. 'ది మార్క్ ఆన్ ది వాల్' ప్రాజెక్ట్‌తో ప్రభుత్వ పాఠశాలల్లోని గోడలపై ఉన్న రాతలు, చిత్రాలను డాక్యుమెంట్ చేసింది. 'ట్రేసెస్' పేరుతో సమాధులపై చేసిన ప్రాజెక్ట్ మరో అద్భుతం. నిజానికి గౌరీ గిల్ అద్భుతాలు సృష్టించడానికి కెమెరా పట్టుకోలేదు. భిన్న సంస్కృతులు, భౌగోళిక అందాలపై ఆసక్తే అద్భుతాలను సృష్టించి ఆమెను అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్‌ని చేశాయి.

బ్యూటిప్స్

తొక్కతో తోమేయండి!



పాదాలను మెరిపించడంలో అరటితొక్కలు చక్కగా పనిచేస్తాయి.

- అరటితొక్కలను పాదాలపైన రుద్దితే మృతకణాలు, దుమ్మూ ధూళీ తొలగిపోతాయి.
- అరటి తొక్కలను ముక్కలుగా తరిగి కొద్దిగా తేనె వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టుని పాదాలకు రాయాలి. అరగంట తరువాత సాధారణ నీటితో కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల పాదాలు మృదువుగా మారడంతో పాటు, చక్కగా మెరుస్తాయి.
- అరటితొక్కల పేస్టులో కొద్దిగా అలోవెరా జెల్ కలపాలి. ఈ పేస్టుని పాదాలకు అప్లై చేయాలి. ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి. ఈ పేస్టు పాదాలకు తేమనందించి కోమలంగా ఉంచుతుంది.
- అరటితొక్కల పేస్టులో కాఫీపొడి, తేనె వేసి కలిపి స్క్రబర్‌లా పదిహేను నిమిషాలు రుద్దాలి. పాదాలపైన మురికి, మలినాలు పోయి చక్కగా మెరుస్తాయి.

కిచెన్‌టిప్స్

మంచుకొండలా? అమ్మో వద్దు..!

ఫ్రీజర్‌లో చిన్నచిన్న మంచుకొండల్లా ఐస్ పేరుకుపోతుంది. ఇలా గడ్డకట్టిన ఐస్‌పైన కొన్ని ఆహార పదార్థాలు పెడితే పాడవుతాయి. ఐస్ ఒకపట్టాన కరగదు. ఇలాంటప్పుడు ఈ చిట్కాలు పాటిస్తే మీ సమస్య తీరిపోతుంది.



- రిఫ్రిజిరేటర్ పవర్ స్విచ్ ఆపేసి గడ్డకట్టిన ఐస్‌ను కరిగించాలి.
- ఇప్పుడు బంగాళదుంపను శుభ్రంగా కడిగి రెండు ముక్కలు చేయాలి. రెండు ముక్కలతో ఫ్రీజర్ ర్యాక్స్‌ను రుద్దాలి. మూలల్లో కూడా జాగ్రత్తగా రుద్దాలి. ఇలా చేస్తే ఫ్రీజర్‌లో త్వరగా మంచు ఉండలు ఏర్పడవు.
- అవసరాన్ని బట్టి రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రతలను మార్చుకుంటూ ఉంటే ఐస్ ఏర్పడదు.
- ఫ్రీజర్‌లో అతిగా ఆహార పదార్థాలను పెట్టకూడదు. ఎక్కువ మొత్తంలో వస్తువులు పెడితే ఐస్ ఏర్పడడానికి ఖాళీ ఉండదని కుక్కేస్తుంటారు. ఫ్రీజర్‌లో ఎంత ఎక్కువమొత్తంలో వస్తువులు ఉంటే అంత ఎక్కువ తేమ ఏర్పడి ఐస్‌గా మారుతుంది.
- చాలామంది ఇంటిని శుభ్రం చేస్తుంటారు కానీ రిఫ్రిజిరేటర్‌ను పెద్దగా పట్టించుకోరు. కనీసం పదిరోజులకొకసారి స్విచ్ ఆపేసి, లోపల ఉన్న పదార్థాలను బయటపెట్టి శుభ్రం చేస్తే ఐస్ సమస్య అంతగా ఉండదు.

గార్డెన్ టిప్స్

పుల్లలతో పూలు పూస్తాయి!

గార్డెన్‌లో ఎంతో ఇష్టంగా మొక్కలు పెంచుతుంటాము. సమయానికి నీళ్లుపోసి, మొక్కల ఎదుగుదలకోసం ప్రత్యేక శ్రద్ధ వహించినప్పటికీ కొన్ని మొక్కలు బలహీనంగా, వాడిపోయినట్టుగా ఉంటాయి. ఇలాంటి మొక్కలను పూలతో చక్కగా కళకళలాడేలా చేయాలంటే పాదులో అగ్గిపుల్లలు గుచ్చాలి. అవును అగ్గిపుల్లలే...



- అగ్గిపుల్లలను యాంటీమోనీ సల్ఫైడ్, పొటాషియం, సల్ఫర్, మెగ్నీషియం, క్లోరేట్ రసాయనాలతో తయారు చేస్తారు. ఈ రసాయనాలు మొక్కలకు క్రిమిసంహారాలుగా పనిచేస్తాయి.
- అంతేగాక ఇవి వేర్లకు బలాన్ని ఇస్తాయి. సల్ఫర్, మెగ్నీషియం, క్లోరేట్‌లు మొక్కలు వేళ్ల నుంచి చక్కగా పెరిగేందుకు దోహద పడతాయి.
- ముందుగా కుండీలోని మొక్క చుట్టూ కొన్ని నీళ్లుపోయాలి. ఇప్పుడు పది అగ్గిపుల్లలను రసాయనం ఉన్నవైపు మట్టిలోకి గుచ్చాలి.
- పుల్ల పుల్లకు కొద్దిగా దూరం ఉండేలా .. అగ్గిపుల్ల పూర్తిగా మట్టిలోకి చొచ్చుకుపోయేలా గుచ్చాలి.
- ఇలా నెలకు ఒక్కసారి మాత్రమే పుల్లలను గుచ్చాలి. గుచ్చిన పుల్లలను పదిహేను రోజుల తరువాత తీసేయాలి.
- ఇలా చేయడం వల్ల మొక్కల పెరుగుదలకు కావాల్సిన పోషకాలు అగ్గిపుల్లల నుంచి అంది, మొక్క బలంగా పెరిగి పూలూ, పండ్లను చక్కగా ఇస్తుంది.



యాప్‌లారిటీ




శివరీన - శిల్పాభట్

యాప్ స్టోర్‌లలో గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్‌ల హవా కొనసాగుతుండగానే 'నేను సైతం' అంటోంది ఫోన్‌పే. 'ఇండస్ స్టోర్' పేరుతో కొత్త యాప్ స్టోర్‌ను తీసుకురానుంది.

యాప్ స్టోర్‌ల పోటీ సంగతి ఎలా ఉన్నా, దేశీయ యాప్‌లు వెలిగిపోతున్న కాలం ఇది.

'ఒక యాప్ ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది' అనేది నిజమే అయినా అది ఎలాంటి ఐడియా అనేదే కీలకం.

ఆ కీలకమైన విషయాలను దృష్టిలో పెట్టుకొని పాపులర్ యాప్‌ల రూపకల్పనపై దృష్టి పెడుతున్నారు యంగ్ యాప్ డెవలపర్‌లు. యాప్–పాపులారిటీని కలిపి నెటిజనులు సరదాగా సృష్టించిన 'యాప్‌లారిటీ'కి న్యాయం చేసేలా కృషి చేస్తున్నారు...

'సాధించాలనుకున్నప్పుడు సాధన చెయ్' అనే మంచి మాట శివరీన సారికను కొత్త దారిలోకి తీసుకెళ్లింది. 'ప్రెగ్‌బడ్డీ' అనే పాపులర్ యాప్ ఆవిష్కరించడానికి కారణం అయింది. స్టార్ డెవలపర్‌గా తన పేరు మారుమోగేలా చేసింది. గేమింగ్ స్టూడియో '99 గేమ్స్' వైస్ ప్రెసిడెంట్ శిల్పాభట్ 'నేను సాధిస్తాను' అంటూ నమ్మకంగా రంగంలోకి దిగి, సక్సెస్‌ఫుల్ డెవలపర్‌ల వరుసలో నిలిచింది.

శివరీన ఐఐటీ–ఖరగ్‌పూర్ గ్రాడ్యుయేట్. తన సోదరికి గర్భస్రావం అయినప్పుడు కుటుంబం మొత్తం విషాదంలో మునిగిపోయింది. 'మనం నిరంతరం టెక్నాలజీ మధ్యలోనే గడుపుతున్నాం అనుకుంటున్నప్పటికీ, ఆ టెక్నాలజీని కీలకమైన సమయంలో మాత్రం ఉపయోగించుకోలేకపోతున్నాం' అనే ఆలోచనతో తల్లులు, తల్లులు కావాలనుకునే వారి కోసం వాట్సాప్ గ్రూప్ మొదలు పెట్టింది. వారిని ఎన్నో ప్రశ్నలు అడిగి తెలుసుకుంది. నాలుగు నెలల తరువాత తన టీమ్‌తో కలిసి 'ప్రెగ్‌బడ్డీ' యాప్ డెవలప్‌మెంట్‌పై పనిచేసింది. తల్లులు, తల్లి కావాలనుకుంటున్నవారికి అనేక రకాలుగా ఉపయోగపడే ఈ యాప్ సంవత్సర కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయింది.

ఉడిపి (కర్నాటక)లోని 'రోబోసాఫ్ట్' అనే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీలో పనిచేసిన శిల్పాభట్ '99గేమ్స్'తో గేమ్ డెవలపర్‌గా మారింది.

'చాలామందికి టెక్నాలజీ అంటే ఇష్టం ఉన్నప్పటికీ ఆవిష్కరణల విషయం వచ్చేసరికి అది వేరే వాళ్ల వ్యవహారం, మనం చేయలేం అనుకుంటారు. అయితే ఇది సరికాదు. మనం ఏదైనా చేయాలంటే ముందు తెలుసుకోవాలి, నేర్చుకోవాలి. తెలుసుకుంటూ నేర్చుకుంటూనే ఎన్నో చేయవచ్చు' అంటుంది శివరీన.

'సాధించాలనే తపన గట్టిగా ఉంటే ఏదీ అసాధ్యం కాదు. ప్రోగ్రామింగ్ లేదా గేమ్ డెవలప్‌మెంట్ మీ ప్యాషన్ అయితే, ఆ ప్యాషన్‌ను గుండెల్లోకి తెచ్చుకోండి. గుండె నిండా ధైర్యంతో నేను సాధించగలను అనే నమ్మకాన్ని సొంతం చేసుకోండి' అంటుంది శిల్పాభట్.



బిలియన్ డాలర్ ఐడియా

యాప్ బిల్డింగ్‌పై ఆసక్తి ఉన్న యువతరానికి ఇష్టమైన పుస్తకాల్లో ఒకటి... జార్జ్ బెర్కోవోస్కీ 'హౌ టు బిల్డ్ ఏ బిలియన్ డాలర్ యాప్' పుస్తకం. 'మొబైల్ జెనెటిక్స్' 'ఏ బిలియన్ డాలర్ ఐడియా' 'ఈజ్ యువర్ యాప్ రెడీ ఫర్ ఇన్వెస్ట్‌మెంట్?' 'హౌ మచ్ ఈజ్ యువర్ యాప్ వర్త్ అండ్ హౌ మచ్ మనీ షుడ్ యూ రైజ్?' 'ది టెన్–మిలియన్– డాలర్ యాప్' 'మేక్ సమ్‌థింగ్ పీపుల్ లవ్' 'డాలర్స్ ఇన్ ది డోర్' 'ఏ కలర్‌ఫుల్ లెస్సన్' 'మనీ ఫర్ సేల్'... మొదలైన ఆసక్తికరమైన చాప్టర్‌లు ఈ పుస్తకంలో ఉన్నాయి. 'బిలియన్ డాలర్‌ల యాప్స్‌ను రూపొందించిన వారి బుర్రలతో ఆలోచింపచేసే పుసక్తం ఇది' అంటున్నాడు బెర్కోవోస్కీ. ఇంజనీర్, సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ అయిన బెర్కోవోస్కీ ఎంతోమంది విజేతలతో మాట్లాడి, తన స్వీయ అనుభవాలను జోడించి ఈ పుస్తకం రాశాడు.

చిన్న వయసులోనే ఎన్నో మిలియన్ డాలర్ యాప్స్‌ను సృష్టించి పెద్ద పేరు తెచ్చుకున్నాడు సిద్ధార్థ్ నాయక్. సక్సెస్‌ఫుల్ యాప్‌లను ఎలా బిల్డ్ చేయాలో బాగా తెలిసిన నాయక్ పదమూడు సంవత్సరాల వయసులోనే వెదర్ ప్రెడిక్షన్ యాప్‌ను క్రియేట్ చేశాడు.

'తనదైన విలువను మార్కెట్‌లో సృష్టించగలిగినప్పుడే ఒక వ్యాపార సంస్థకు సంబంధించిన ప్రయోజనం నెరవేరినట్లు అవుతుంది. వినియోగదారులు, ఉద్యోగులు, ఇన్వెస్టర్‌ల ప్రయోజనాలు పరస్పరం ముడిపడి ఉంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ ఉపయోగపడే యాప్‌ను సృష్టించడంపై దృష్టి పెడతాను. అత్యంత విలువైన సాంకేతిక పరిజ్ఞానంతో యాప్‌ను రూపొందించినప్పటికీ అది వినియోగదారులను ఆకట్టుకోకపోతే ప్రయోజనం నెరవేరనట్లే. యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను దృష్టిలో పెట్టుకొని యాప్‌ను డిజైన్ చేయడం అనేది ముఖ్యమైన విషయం' అంటున్నాడు నాయక్.

చిన్న యాప్‌లు కూడా పెద్ద విజయం సాధించడానికి ప్రధాన కారణం క్రియేటర్‌లు యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను దృష్టిలో పెట్టుకోవడమే.

చైనీస్ యాప్‌లను నిషేధించిన తరువాత ఆ ప్లేస్‌లోకి మన కుర్రాళ్ల యాప్స్ వచ్చాయి. 'ఎంఎక్స్ టకాటక్' అలాంటిదే. 'ఇదే సరియైన సమయం అనుకొని మా టీమ్ ఆరు రోజులు రాత్రి, పగలు కష్టపడి ఈ యాప్‌ను డిజైన్ చేశాం. భారతీయత ఒక్కటే మార్కెట్‌లో విజయం సాధించడానికి కారణం కాదు. ఇతరుల కంటే ఏ రకంగా భిన్నంగా ఉన్నాం అనేదానిపైనే మన విజయం ఆధారపడి ఉంటుంది' అంటున్నాడు 'ఎంఎక్స్ టకాటక్' సీయివో కిరణ్ బేడీ.

స్వదేశీ యాప్‌లు విజయంతో వెలిగిపోతున్న కాలం ఇది.

'నాణ్యత అంశాలను విస్మరిస్తే ఫలితం వేరేలా ఉంటుంది. ఎప్పటికప్పుడు మెరుగైన యూజర్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలి' అంటున్నారు నిపుణులు.